లక్ష్మీరామేశ్వరము

నరహరిసెట్టి వెంకటరత్నముగారు

౧

ఆమె "నిజముగా చెప్పండి; మరల పెళ్లి చేసుకోరు కదూ?" అనెను. రామేశ్వరుడు దీనవదనముతో, "లక్ష్మీ! నీమాటలు నేను వినజాలను. ఈరోజున ఏమిటి నీవు నాహృదయమును దహింప జేస్తున్నావు." అనెను.

లక్ష్మి రామేశ్వరుని భార్య. ఇరువురును నూతనయౌవనులు. రామేశ్వరుడు ఇరువదినాలుగువత్సరముల ప్రాయము వాడు; లక్ష్మి పదునెనిమిది వర్షముల యువతీమణి. ఒక దినమున అపరాహ్ణసమయమున ఈసతీపతు లిరువురు చతురంగము ఆడుకొనుచుండిరి. ఆటనడుమ లక్ష్మి సంభాషణమును మార్చి పైవిధమున దీసికొనివచ్చినది. సహజకోమలహృదయుడు—రామేశ్వరుడు ప్రియతమ, మితభాషిణి యగు లక్ష్మి ఇట్లు మాటాడుట గని ఆశ్చర్యపడుటయే కాక అంతరంగమున జాల బాధ ననుభవించుచుండెను.

లక్ష్మి లేనినవ్వు తెచ్చుకొని మిగుల మధురము, మిగుల కఠినము గాని కంఠస్వరమున "మీ మనసుకు బాధ కలిగించవలె నని నామతము కాదు. మీ రేమనుకొనినా సరే, ఈ ఒక్క విషయములో నాకు స్వేచ్ఛ ప్రసాదించి నిక్కముగా జవాబు చెప్పండి. ఇక నేనేమీ మాటాడను." అని పతివైపు పిచ్చిదానివలె జూచుచుండెను. ఆచూపులో భావమేమియు లేదు. అర్థ మంతకన్న లేదు.

రామేశ్వరునకు నెన్నడు లక్ష్మిపై కోపము రాలేదు. అప్పుడప్పుడు రామేశ్వరుడు భార్యను కోపించుచుండునని లోకు లనుకొనెదరుగాని ఆమాటలో కొంచెమైనను సత్యము లేకపోలేదు. ఇంతవఱకు నాతడు జూపినది కృత్రిమకోపము. వివాహమై ఆరువత్సరములు గడచినవి. లక్ష్మిపై నిజమైనకోప మాతనికి ఈరోజున మాత్రమే వచ్చినది. రామేశ్వరుడు చటాలున దనప్రక్కనున్న తిలకు గారి "కర్మయోగశాస్త్రము" దీసి శిరసున బెట్టుకొని కోపముతో, "లక్ష్మీ! ఇదే నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా లక్ష్మి జీవించియున్నను లేకపోయినను నేను పరస్త్రీ ముఖము తలయెత్తి చూడను. (కొంచెము నేపూరకుండి) ఇకనైనా నన్ను వదలుదువా?" అని చతురంగపుఆట సాగించెను.

పతివ్రతాశిరోమణి యగు లక్ష్మి తల వంచుకొనినది; ఒకటిరెండు అశ్రుబిందువులు కనుకొలంకుల నుండి జారినవి. భర్త ఆవిషయము గాంచ లేదనియీమాముద్దరా లనుకొనెను గాని రామేశ్వరుడు మాత్రము చూడక పోలేదు. ఆతని నవనీతకోమల హృదయము విదారిత మైపోవుచుండెను. జోస్యము చెప్పగల వారైనను ఆరంగము గాంచి రామేశ్వరునిది "అసలైనప్రేమ" అని యనకుండ జాలరు.

౨

పదునొకండు మాసములు గడచినవి. లక్ష్మి మార్గశీర్ష బహుళ ఏకాదశినాడు అర్ధరాత్రమున ఆడశిశువును ప్రసవించినది. కాలగర్భాన లీనమగుచున్న వా రందఱు నేల అట్లగుచుండిరో ఎవరు సిద్ధాంతీకరించి చెప్పగలరు? బహుళద్వాదశి—సాయంసమయము. అంధకారము మెలమెల్లన ఆవరించుచున్నది. అనంతనీలాకాశము, పక్షులు, వృక్షములు, మందపవనుడు—సర్వముగూడ దుఃఖించుచున్న భంగి తోచుచున్నవి. లక్ష్మి—ప్రాణవాయువు ఈ పాంచభౌతిక దేహమును విడిచిపెట్టి పోయినది. పూళ్లగ్రామమున—ఆ దుఃఖమయభవనమున ఎల్లరు దుఃఖితహృదయులై యుండిరి. ఒకరిద్దరు మాత్రము బిగ్గరగా నేడ్చుచున్నారు.

ఒకవిరాగి ఆత్రోవను బోవుచు "ఎందుకు దుఃఖపడతారు?" అనుకొనెను.

3

పరమేశ్వరుడు—"లక్ష్మిఅనుఈఆత్మ నరకలోకానికి పోవాలి." లక్ష్మిఆత్మ—"ప్రభూ! నరకలోకానికి పోవడానికి నాకేమీ అభ్యంతరము లేదు. మీ ఆజ్ఞానుసారము అల్లాగ వెళ్తాను. నాభర్త, నేను చాలా అన్యోన్యంగా ఉండేవాళ్లము. నేను మానవశరీరములో ఉన్నప్పుడు ఆయనను విడిచి ఎప్పుడూ ఉండలేదు. ఆయన్ను విడవవలసివస్తుందని పుట్టింటికి కూడా వెళ్లలేదు. ఆయన కూడా నేనంటే అంతప్రేమాతిశయముతో ఉండేవారు. మీ ఆజ్ఞ అయింది; విడవలేక విడవలేక నాప్రాణేశ్వరుని విడిచివచ్చాను. ఏమిచెయ్యను; విడిచి రావలసి వచ్చింది. ఒక్క సారి నే నాయన్ను దర్శించుకు రావడానికి—ఓదార్చడానికి సెలవు దయచేయించండి ప్రభూ! ఆయన నాకోసము ఎంతదుఃఖిస్తూఉంటారో నే నేమిమనవి చేయగలను! ఒక నిముసమైనా విడవకుండా ఉండే నాహృదయేశ్వరుని అపారదుఃఖసముద్రములో—నిబిడాంధ కా ర ము న విడిచివచ్చేశాను. నన్ను విడిచి—ప్రియతమనైన ఈదాసిని విడిచి నాప్రియతముడు ఎల్లా ఉంటున్నాడో భావించుటకు కూడా నేను సహించలేకుండా ఉన్నాను. ఆయన్ని నేను పువ్వుల్లో పెట్టి పూజించేదాన్ని. అంత కోమలంగా ఉండే ఆ సుకుమారమూర్తిని "నాకోసము దుఃఖించవద్దు; జరగవలసినట్లు జరుగుతుంది" అని ఓదార్చి కన్నీరు తుడిచి వస్తాను. సర్వము తెలిసిన ప్రభువగు నీకు నేనేమి చెప్పగలను? దేవా, సెలవు దయచేయించండి!" అని వినయవినమితయై చెప్పుకొనెను. పరమేశ్వరుడు—"వెళ్లిరమ్ము".

౭

ఆత్మ పరలోకమును విడిచి భూలోకమును ప్రవేశించెను; భర్తృగృహోన్ముఖమై వెళ్లుచున్నది. ఇంతలో నౌకరయారునందు రామేశ్వరుని కంఠస్వరము వినిపించెను. ఆ యాత్మ త్వరితముగ నామందిరమును బ్రవేశించి రామేశ్వరుడు నవనవోన్మేషయగు నౌకరమణీమణి చెంత గూరుచుండి ప్రణయసల్లాపము లాడుచుండుట గాంచినది. "ఏమీ! ఈమెయెవతె—ఔరా, అప్పుడే ద్వితీయ వివాహమా!—మోసము, మోసము, ఇంతకన్న మోసమున్నదా, ఏలోకములోనైనా?

ఇచట కూర్చున్నది నాప్రాణేశ్వరుడేనా! ఇట్లు జరుగుతుందా? ఆప్రేమ, ఆ ఆదరము, ఆ అభిమానము ఎక్కడికి పోయినవి. ఎంతో దుఃఖిస్తూ ఉంటా డనుకొన్న నాభర్త ఆనందమున నోలలాడుటయా?—నేను నమ్మజాలను.

ఏమీ! ఆనాడు భగవద్గీత నెత్తిపై బెట్టుకొని ప్రమాణము కూడ చేసెనే. ప్రమాణముతో లెక్కయేమి? అంతప్రేమతో ఉండే భర్త—ఇంకేలోకములోనూ ఉండడనుకున్న నాభర్తయేనా ఇట్లయిపోవుట. అయ్యో దేవా! నీవెంత విచిత్రవర్తనుడవు! నాభర్త లోపమేమియు లేదు. నీదే బాధ్యత—

అయ్యయ్యో, పరమేశ్వరుని తూలనాడుతున్నానా? 'సర్వము నీవే, నీవు లేకపోతే ఏమీ లేదు' అనుచుండే నాభర్తనవలెను కాని, నన్ను శాశ్వత ధర్మపత్నిగా స్వీకరించినట్లు అగ్నిసాక్షిగా ప్రతినకూడా చేసెనే! 'నిజమైన ప్రేమ నాభర్తది. ఇతరుల దంపతిది బూటకపు ప్రేమ' అనుకొన్న నేను 'అది ప్రేమ కాదు, కామము' అని అనుకొనవలసి వచ్చిందా ప్రభూ! దేహాన్ని మాత్రమే కామించే భర్త నిజమైన భర్త యెట్లగును?—

ఈతడె దైవము; వేరే దైవము లేడనుకొనేదాన్ని. ఒకసారి ఒకనెచ్చెలి భర్తను దైవములాగు చూడాలి కాని భర్త దైవము కాజాలడు అని చెప్పింది. అప్పట్లో ఆమె మాట లెక్క చెయ్యలేదు. 'ఈతనికంటే ప్రేమింపదగినది ప్రపంచంలో ఇంకేమీ లేదు: ఈయనే నేను; నేనే ఈయన' అనుకొని ప్రేమించినందుకా ఇట్లు మోసగించుట! అయ్యో ప్రభూ! నిన్ను గ్రహించుట ఎల్లాగు?

ఇక ఆ చంటిపాపగతి ఏమవుతుందో. ఇంత చిత్తచాంచల్యము గల మానవులను నమ్ముటెట్లాగు? 'పురుషులను నమ్మకూడ' దని దేవుడు వ్రాసిపెట్టి ఉంచాడు కాబోలు. ఆసంగతి యింతవరకు తెలిసికోలేకపోయాను. ఇంకా యెందుకిక్కడ? ఇక పోతాను." అనుకొని పరలోకమునకు ప్రయాణమయ్యెను.

౮

లక్ష్మి పరమేశ్వరుని దివ్యసన్నిధికి జని, "దేవా! నన్నిక నరకలోకానికి పంపండి" అనెను.

పరమేశ్వరుడు "నీవిక నరకలోకానికి వెళ్లవలసిన ఆవశ్యకత లేదు. నువ్వు ఇట్టి పతిని దైవముగా భావించావు. దైవ మొకడున్న సంగతే మఱచి అతడే దైవ మనుకున్నావు.

భర్తను భార్య దైవము లాగున నెంచి గౌరవించవచ్చును, కాని ఆతడే దైవ మనుకొనుట కూడనిపని. ఇప్పుడు నీవుపడిన పశ్చాత్తాపము వల్ల నీదోషము పోయింది.—ఇక నీవు పవిత్రమైన దానవు. స్వర్గానికి వెళ్లి ఆనందమున ఉండు. సత్యమైన ప్రేమామృతము ఇక్కడొక్క చోటనే అనుభవించగలవు కాని ఇంకెక్కడా నీకా ప్రేమామృతము లభింపదు. పోయి శాంతి నిలయము, ఆనందనిలయము, ప్రేమనిలయము అయినస్వర్గధామంలో ఉండు" అని ఆశీర్వదించెను.

లక్ష్మి ఇప్పుడు ప్రశాంతిసకేతనమగు ప్రేమానంద నిలయమున సంకల్పరహితమై యున్నది.



రాగాతిశయము

దుగ్గిరాల పల్లంరాజు, పానుగంటి చిరంజీవిరావుగార్లు

ప్రవిమలంబగు మామకభావవీథి
తెక్కగదలని నిగమాంతరీతు నీమఁ
జక్కమైననుఁ బొడువనిఁ చోటు వెదకి
కేల నీముద్దు పిల్లనగ్రోలు పట్టి
దర్శనం బిచ్చినావు సంతసమె కాని
పెదవిఁ గదుపవు మొగ్గలు విరియునయ్యా!
కళలు పరువొందు నీచిన్నిగళము నెత్తి
యొక్కస్వర మూఁదు, తేనియ లూరఁ గృష్ణ!

చిలుకపలుకు, వసంతకోకిలరవంబు,
నళిరుతము మించి యొయ్యార మతిశయించు
సరససంగీతమాధురీ స్వరయుతమగు
రాగ మేదయ్యా! నాదువరాలతండ్రి!
చిన్నవాఁడవె! యింత యాచింపవలెనె
తలఁపుమున్నే రుఁ బరిసెలఁ ద్రాగుదువట
తెలియఁగాలేవె? నావాంఛ తెలిసి యొక్క
రాగమును బాడవేమయ్య, రసికవర్య,
గానలోల! నీ వేనాఁడు వేణువొత్తి
పాడినాఁడవో చల్లని పరుసలెల్ల
వింటినో లేదో నాఁడు నీ వేణురవము
నూఁదు మతియొక్కమాఱు మహోత్సవముగ
పథముఁ దెలిపెడు నీ కనుపాఁ బట్టి
ఊర్పువేత్రము నల్ల చేయూఁతఁ బూని
నొక్కునొక్కున నొకమెట్టు నెక్కినీదు
స్వరముతో నందుకొందును స్వర్గతలము
ముద్దుకృష్ణయ్య! చిన్నారి మురళి నెత్తి
యాలసింపవె త్రొల్లి నీవల్ల గొల్ల
పల్లె నూఁదిన మధురసుస్వరము దివ్య
మోహనంబైన రాగ మార్గోహణమున.